క్లుప్తంగా

ఇళ్లు పంపిణీ చేయాలి

సూర్యాపేట అర్బన్ : సూర్యాపేట పట్టణంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అర్హులైన పేదలందరికీ ఇవ్వాలని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపుదాసు సాయికుమార్ అన్నారు. సోమవారం 25వ వార్డులో నిర్వహించిన సీపీఎం నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం మూలంగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు శిథిలావస్థలోకి చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లను వెంటనే లబ్ధిదారులకు ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు మామిడి పుల్లయ్య, వట్టె ఎర్రయ్య, కప్పల సత్యం, బుద్ధ సంతోష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కార్మికుల రక్షణ చట్టం అమలుచేయాలి



మాట్లాడుతున్న నెమ్మాది వెంకటేశ్వర్లు

సూర్యాపేట అర్బన్ : బతుకు దెరువు కోసం వలస వచ్చిన కార్మికులకు వలస కార్మిక చట్టాలను అమలు చేసి రక్షణ కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం శాంతి నగర్, విజయ కాలనీ పారిశ్రామిక వాడలో వలస కార్మికుల స్థితిగతులపై సీఐటీయూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. వలస కార్మికులు అతి తక్కువ వేతనంతో పని చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు వల్లపుదాస్ సాయికుమార్, వీరబోయిన రవికుమార్, శంకర్, నాగరాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తిరుమలగిరి : తిరుమలగిరి మండలం జలాల్‌పురం సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 3గంటల వరకు విద్యుత్ మరమ్మతులు జరుగుతున్న కారణంగా జలాల్‌పురం, మామిడాల, సిద్దిసముద్రం, గొట్టిపర్తి, ఎంకే తండా, వెలిశాల ఎక్స్ రోడ్‌లలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ గిరిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతరాయానికి రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

యువతకు ఆదర్శం రామయ్య



మొక్కలతో రామయ్య దంపతులు

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణకు కృషిచేస్తున్న సూర్యాపేట జిల్లా ఆర్యవైశ్య సంఘం ఉపాధ్యక్షుడు, శ్రీవాసవి సేవాసమితి సభ్యుడు, రిటైర్డ్ బ్యాంకు ఉద్యోగి తాళ్లపల్లి రామయ్య యువతకు ఆదర్శమని పర్యావరణ ప్రేమికులు అన్నారు. జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు వెంపటి వెంకటేశ్వరరావు పిలుపు మేరకు రామయ్య దంపతులు తమ ఇద్దరు కుమార్తెల పెళ్లి రోజు సందర్భంగా సోమవారం తమ నివాసంతోపాటు పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు పర్యావరణ ప్రేమికులు ఆయనను అభినందించారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబీకుడు బుషిపాక శ్రీరాములు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. సోమవారం మృతుడి కుటుంబాన్ని జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పరామర్శించి రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బద్దం యాదగిరిగౌడ్, కుంట్ల శ్రీనివాసరెడ్డి, మచ్చ నాగయ్య, పి.మహేష్, వి.దుర్గాప్రసాద్, వి.వెంకన్న, శ్రీను, నర్సయ్య, వీరస్వామి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడలను ప్రారంభిస్తున్న సైదులు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తోందని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. సోమవారం వెంపటి ప్రాథమిక పాఠశాలలో మండల స్థాయి కబడ్డీ ఎస్‌జీఎఫ్ క్రీడలను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని అన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి బోయిని లింగయ్య, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, క్రీడల కన్వీనర్ కొనదాడుపుల యాకయ్య, పీడీలు మల్లేష్, పుల్లయ్య, యాదయ్య, అంబేద్కర్, శ్రీనివాస్, దాతలు గాజుల యాదగిరి, శ్రీకాంత్, అంజయ్య, చంద్రయ్య, చంద్రమౌళి, గ్రామ సెక్రటరీ వీరేందర్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు

- బోర్డులకే పరిమితం అవుతున్న మైదానాలు
- పరికరాలు లేక సద్వినియోగం చేసుకోలేకపోతున్న యువత



లక్ష్మణ్‌నాయక్‌తండా ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన క్రీడాప్రాంగణం



ఎర్ర సూర్యాతండాలో రాళ్ల వద్ద ఏర్పాటు చేసిన క్రీడా మైదానం

చివ్వెంల : గ్రామీణ యువతకు క్రీడలలో ప్రోత్సాహం అందించాలనే మంచి ఉద్దేశంతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం పల్లెల్లో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. కానీ, చాలా చోట్ల ఈ ప్రాంగణాలు కేవలం బోర్డులకే పరిమితం అవుతున్నాయి. క్రీడా ప్రాంగణాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారే తప్ప, క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు.

సౌకర్యాలు శూన్యం..

మండలంలోని చాలా గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలు ఉన్నట్లు అధికారికంగా చెబుతున్నా, వాస్తవ పరిస్థితులు దానికి భిన్నంగా ఉన్నాయి. ఈ ప్రాంగణాల్లో క్రీడా ఉపకరణాలు ఏవీ లేవు. కొన్నిచోట్ల ఇరుకుగా ఉన్న పాఠశాలల్లోనే మైదానాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరికొన్ని చోట్ల అటవీ ప్రాంతంలో కేవలం బోర్డులు పెట్టి వదిలేశారు. దీని వల్ల క్రీడాకారులు సాధన చేయడానికి ఎలాంటి సౌకర్యాలు లేక నిరాశ చెందుతున్నారు. పిల్లలజెగ్గుతండా, జగనాతండా గ్రామ పంచాయతీలలో క్రీడలకు అనుకూలమైన స్థలం ఉన్నప్పటికీ, క్రీడా పరికరాలు లేకపోవడంతో యువత ఆడుకోవడానికి వీలు లేకుండాపోతోంది.

క్రీడా మైదానాలు ఉండాల్సింది ఇలా..

క్రీడా ప్రాంగణాలు గ్రామాలకు దగ్గర్లో కనీసం ఎకరం స్థలంలో ఉండాలి. మైదానం చుట్టూ మొక్కలు నాటాలి. పిచ్చిమొక్కలు తొలగించి మైదానాన్ని చదును చేయాలి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ కోర్టులతో పాటు లాంగ్ జంప్ కోసం ఆరు మీటర్ల పొడవు, మూడు మీటర్ల వెడల్పు, 0.5 మీటర్ల లోతులో ఇసుకతో నింపిన గుంతను ఏర్పాటు చేయాలి. అంతే కాకుండా వ్యాయామ బార్ కూడా ఉండాలి. కానీ, ఈ మార్గదర్శకాలు చాలా చోట్ల పాటించడం లేదు. అధికారులు కేవలం ప్రచారం కోసమే క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తున్నారని, యువత క్రీడా సామర్థ్యాన్ని పెంచడంలో వారికి నిజమైన చిత్తశుద్ధి లేదని స్థానిక యువత వాపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయంపై దృష్టి సారించి, క్రీడా ప్రాంగణాలను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తేనే గ్రామీణ యువతకు నిజమైన మేలు జరుగుతుందని క్రీడాభిమానులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు

మా గ్రామంలో చాలా మంది క్రీడాకారులు ఉన్నారు. కానీ, గ్రామానికి దూరంగా, రాళ్లు ఉన్న చోట క్రీడా ప్రాంగణం ఏర్పాటు చేశారు. దీంతో సాధన చేయడానికి ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు స్పందించి, సాధన చేసేందుకు అనువైన స్థలం చూసి, ప్రాంగణాన్ని అక్కడికి మార్చాలి.

– బి. సాయికుమార్, ఎర్ర సూర్యాతండా

అన్ని గ్రామాల్లో ఏర్పాటు



క్రీడాకారులలో ఉత్సాహం నింపేందుకు అవగాహన కల్పిస్తున్నాము. ఇప్పటికే అన్ని గ్రామాల్లో ప్రాంగణాలను ఏర్పాటు చేశాము. ఒక్కో ప్రాంగణానికి రూ. 30 వేలు వెచ్చించి ఏర్పాటు చేశాము. ప్రభుత్వం పంపిణీ చేసిన కిట్లను కూడా అందజేశాము. కొన్ని చోట్ల స్థల సమస్య కారణంగా పాఠశాలల ఆవరణలో ఏర్పాటు చేశాము. అనువైన స్థలం దొరికిన వెంటనే అక్కడికి మారుస్తాము.

– సీహెచ్. సంతోష్‌కుమార్, ఎంపీడీఓ

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం



సూర్యాపేట : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు పవిత్రను సన్మానిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు



ఉత్తమ ఉపాధ్యాయురాలు పవిత్రకు స్వీటు తినిపిస్తున్న భర్త నాతాల మన్మథరెడ్డి

సూర్యాపేట : జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు అవార్డుకు ఎంపికైన మారం పవిత్రను సోమవారం సూర్యాపేట పట్టణం జమ్మిగడ్డలోని ఆమె నివాసంలో పీఆర్‌టీయూ సంఘం జిల్లా అధ్యక్షుడు తంగెళ్ల జితేందర్‌రెడ్డితోపాటు పలువురు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమెను పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ సంఘం నాయకులు కందుకూరు శివశంకర్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మేకల రాజశేఖర్, వెంకటేశ్వర్లు, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు అల్లాడి సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు సంద సైదిరెడ్డి, మండల అధ్యక్షుడు సంద్యాల వినోద్, నల్ల శ్రీనివాసులు, మన్నెం రాంరెడ్డి, ముత్తినేని స్నేహలత, మసూద్‌అహ్మద్ పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాలు ప్రతిష్ఠించాలి

ఆత్మకూర్ (ఎస్) : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించాలని తహసీల్దార్ అమీన్ సింగ్ అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తహసీల్దార్ కార్యాలయంలో 40 మట్టి గణపతి విగ్రహాలు (ఫీటు ఎత్తుకలవి) ఉన్నాయని, ఔత్సాహికులు కార్యాలయంలో సంప్రదించి విగ్రహాలను తీసుకువెళ్లి ప్రతిష్ఠించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ హసీం ఏపీఓ ఈశ్వర్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూర్ (ఎస్) : తహసీల్దార్ కార్యాలయంలో మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న అధికారులు

ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీ

సూర్యాపేట : పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తూ.. గణేష్ నవరాత్రోత్సవాలకు ఉచితంగా బంకమట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు జిల్లా ఆర్యవైశ్య సంఘం కోశాధికారి చల్లా లక్ష్మీకాంత్ తెలిపారు. బుధవారం పట్టణంలోని వీటీ రోడ్‌లో ఉచితంగా విగ్రహాలతోపాటు క్లాత్ బ్యాగ్‌లు కూడా పంపిణీ చేయనున్నామని సోమవారం ఆయన ప్రకటనలో తెలియజేశారు. ఇళ్లలో పూజల కోసం తయారు చేయబడిన ఈ విగ్రహాలను తీసుకొని పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అర్వపల్లి : రేఖ చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రోత్సవాలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ బోయలపల్లి రేఖ తెలిపారు. సోమవారం అడివెంలలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాలు, పట్టణాల్లో మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించుకుని పర్యావరణాన్ని కాపాడాలని ఆమె కోరారు.

ఉత్తమ పీపీ అవార్డు గ్రహీతకు ఘన సన్మానం

చివ్వెంల : స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి చేతుల మీదుగా ఉత్తమ పీపీగా అవార్డు అందుకున్న పోక్సో కోర్టు పీపీ నాతి సవీందర్ కుమార్‌ను ఇండియన్ అసోషియేషన్ ఆఫ్ లాయర్స్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మగాని శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి తోగటి మురళి, ఆర్గనైజింగ్ సెక్రటరి గుగులోతు రాజారాం నాయక్, న్యాయవాదులు విద్యాసాగర్, ఇబ్రహీం, బొల్లెద్దు వెంకటరత్నం, బట్టిపల్లి ప్రవీణ్ కుమార్, పంతంగి క్రిష్ణ, డి.కిశోర్, అనంతుల సందీప్ కుమార్, కొమ్ము తరుణ్ యాదవ్, సుజాత, సరిత, శశిరేఖ, సుష్మా, తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ ప్రాసిక్యూటర్ నాతి సవీందర్ కుమార్‌ను సన్మానిస్తున్న న్యాయవాదులు

దివ్యాంగ విద్యార్థులకు ఉచిత వైద్యశిబిరం

సూర్యాపేటటౌన్ : విద్యార్థులు ఉచిత వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కో ఆర్డినేటర్ యర్రంశెట్టి రాంబాబు అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలుర పాఠశాలలో సమగ్ర శిక్ష, అలింకి సంస్థ ఆధ్వర్యంలో 1 నుంచి 18 సంవత్సరాల దివ్యాంగులకు అవసరమయ్యే ఉపకరణాల నిర్ధారణకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ శిబిరంలో 70 మంది దివ్యాంగ విద్యార్థులు పాల్గొన్నట్లు చెప్పారు. దివ్యాంగ చిన్నారులకు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్‌గౌడ్, హెచ్‌ఎం గోలి పద్మ పాల్గొన్నారు.



దివ్యాంగులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని సుందరయ్య కాలనీలో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు డిమాండ్ చేశారు. సోమవారం సుందరయ్య కాలనీలో మాట్లాడారు. గత 25 ఏళ్లుగా ఈ కాలనీలో నివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్న పేదలందరికీ ఇళ్ల పట్టాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఉప్పలయ్య, లక్ష్మి, నగేష్, అంజయ్య, వాసమ్మ, యాదమ్మ, కళమ్మ, అంజలి పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని బొల్లంపల్లికి చెందిన ఖమ్మంపాటి యాదమ్మకు సీఎం సహాయ నిధి నుంచి రూ. 31 వేలు మంజూరయ్యాయి. వైద్య ఖర్చుల నిమిత్తం మంజూరైన ఈ చెక్కును యువజన కాంగ్రెస్ నియోజకవర్గ కార్యదర్శి కేసాని రాహుల్ సోమవారం యాదమ్మ కుమారుడు నరేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు ఖమ్మంపాటి వెంకటేష్, ఇతర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

31న మెగా హెల్త్ క్యాంప్

మద్దిరాల : కుక్కడంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో ఈ నెల 31న వేముగంటి లక్ష్మీనరసింహారావు జ్ఞాపకార్థం వారి కుమారుడైన సుధాకర్‌రావు ఆధ్వర్యంలో వివిధ రకాల వ్యాధులకు మెగా హెల్త్‌క్యాంప్ నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిల్లమల్లు యాదవ్ తెలిపారు. సోమవారం కుక్కడం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నిపుణులైన వైద్యులచే వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. కుక్కడం గ్రామ ప్రజలతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఈ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమానికి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎస్పీ నరసింహ, ఎమ్మెల్యే మందుల సామేల్, రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభిస్తారని తెలిపారు. ఈ హెల్త్ క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో గ్రామశాఖ అధ్యక్షుడు మద్దెల రాములు, మద్దెల భిక్షపతి, వెంకటపెల్లి వెంకటయ్య, యాకయ్య, లాలయ్య తదితరులు పాల్గొన్నారు.

కోతుల బెడద నివారించాలి

నాగారం : ఈటూరు గ్రామంలో కోతుల బెడద నివారించి ప్రజలకు రక్షణ కల్పించాలని కోరుతూ సోమవారం గ్రామానికి చెందిన అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు వంగూరి సందీప్ కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొంత కాలంగా గ్రామంలోకి వేలాది కోతులు వచ్చి ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని అన్నారు. విద్యార్థులపై, వృద్ధులపై, ద్విచక్ర వాహనదారులపై కోతులు దాడులు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని తెలిపారు. ఇళ్లల్లో సామగ్రి, అన్నం, కూరలు ఎత్తుకెళ్తున్నాయని, కోతుల దాడుల్లో అనేకమంది గాయాలపాలవుతున్నారని అన్నారు. అటవీశాఖ అధికారులు, ప్రభుత్వం వీలైనంత త్వరగా గ్రామాల్లో కోతుల బెడదను నివారించాలని కోరారు. ఆయనతో పాటు అంబేద్కర్ యువజన సంఘం ఉపాధ్యక్షుడు పోలేపాక అంజి ఉన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

భానుపురి : జిల్లాలో తాగునీరు, శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా నీరు, పారిశుద్ధ్య మిషన్ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్ మిషన్, తాగునీరు, పారిశుద్ధ్యం, హెల్త్ ఇనిస్టిట్యూషన్, టాయిలెట్స్, శానిటేషన్, మిషన్ భగీరథ కనెక్షన్లు, వనమహోత్సవం తదితర అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అధికారి సంబంధిత పనులపై బాధ్యతాయుతంగా పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ అప్పారావు, డీఎఫ్ సతీష్ కుమార్, డీఈఓ అశోక్, డీపీఓ యాదగిరి, ఎస్సీ కార్పొరేషన్ సంక్షేమ అధికారి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం



తిరుమలగిరి : తాటిపాములలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే



మద్దిరాల : పోలుమల్లలో గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. తిరుమలగిరి మండలం తాటిపాముల గ్రామంలో రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఎంపీ నిధులు రూ.20 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద శాతం అమలు చేస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తోందని, దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. గత పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో ఏ ఒక్కరికీ ఇళ్లు, రేషన్ కార్డులు రాలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే అర్హులందరికీ పథకాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుమలగిరి తహసీల్దార్ హరిప్రసాద్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎల్సోజు నరేష్, కందుకూరి లక్ష్మయ్య, నాయిని కృష్ణ పాల్గొన్నారు.

మద్దిరాల : కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సామేల్ అన్నారు పోలుమల్ల గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో మంజూరైన నూతన గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ముకుందాపురం గ్రామంలో పూర్తయిన సీసీ రోడ్లను, తూర్పుతండాలో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం ఇప్పటివరకు రూ.1400 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, పచ్చిపాల సుమతీవెంకన్న, అనురాధ, ఏలేటి స్వప్న, మైపాల్‌రెడ్డి, శ్యామ్‌రెడ్డి, లింగన్న, లింగరాజు, మామునూరి ఉపేందర్, సోడం శీను, తహసీల్దార్ అయేషా పర్వీన్, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నీటి కోసం జీపీ కార్యాలయం ఎదుట ధర్నా



ఎర్రపహాడ్‌లో ధర్నా చేస్తున్న గ్రామస్తులు

నూతనకల్ : మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో మిషన్ భగీరథ నీటి కోసం గ్రామస్తులు సోమవారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా గ్రామానికి నీరు రావడం లేదని ఆరోపించారు. అధికారులు తక్షణమే స్పందించి మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శిని వివరణ కోరగా రెండు రోజుల క్రితం పైపులైన్ పగలడంతో నీటి సరఫరా నిలిచిపోయిందని తెలిపారు. నీటి సరఫరా కోసం మరమ్మతులు చేపట్టామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రజితలింగరాజు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ఇరుగు అంజయ్య, నారాయణ, అనిల్, అంజయ్య, రామస్వామి, సందీప్‌కుమార్, ఉపేంద్ర, సూరమ్మ, పద్మ, గౌరమ్మ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న శెట్టిగూడెం గ్రామస్తులు

ఆత్మకూర్(ఎస్) : విధులకు సక్రమంగా హాజరు కాకుండా, పారిశుద్ధ్య పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం వహిస్తున్న శెట్టిగూడెం గ్రామపంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆరోపించారు. గ్రామ సమస్యలపై నిలదీసినందుకు కార్యదర్శి తమపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని తెలిపారు. ఈ విషయమై సోమవారం గ్రామస్తులు పోలీస్ స్టేషన్ వద్ద విలేకరులతో మాట్లాడారు. గ్రామంలో నెలకొన్న తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, వాటర్ ప్లాంట్ సమస్యలపై ప్రశ్నిస్తే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారా అని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం కింద ముగ్గురు కూలీలు నర్సరీలో పనులు చేపడితే వారికి రావాల్సిన బిల్లులను ఇతరుల పేరు మీద ఇచ్చారని, ఈ విషయాన్ని అడిగితే బాధితులను బెదిరిస్తున్నారని తెలిపారు. ఉన్నతాధికారులు గ్రామాన్ని సందర్శించి పంచాయతీ సెక్రటరీ పనితీరుపై విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఎంపీడీఓను వివరణ కోరగా రాతపూర్వకంగా ఫిర్యాదులు చేసినట్లయితే విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

పెండింగ్ కమీషన్ అందజేయాలని వినతి



ఆత్మకూర్(ఎస్): వినతిపత్రం ఇస్తున్న రేషన్ డీలర్లు



అర్వపల్లిలో..

ఆత్మకూర్ (ఎస్) : రేషన్ డీలర్లకు 5 నెలల కమీషన్‌ను విడుదల చేయాలని రేషన్ డీలర్లు సోమవారం తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు వినతిపత్రం అందజేశారు. ఏప్రిల్ నుంచి కమీషన్ అందడం లేదని తెలిపారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు అబ్బాయ్య, గోవర్ధన్, గోపాల్ రెడ్డి, రవీందర్, సత్యనారాయణ, విష్ణుమూర్తి, భద్రయ్య, శంకర్ పాల్గొన్నారు.

అర్వపల్లి : గత ఐదు నెలలుగా రావాల్సిన కమీషన్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రేషన్ డీలర్ల మండల సంక్షేమ సంఘం సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలు దండ అరుణభద్రారెడ్డి, కార్యదర్శి తన్నీరు జనార్దన్, గౌరవ అధ్యక్షుడు మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

తుంగతుర్తి : రేషన్ డీలర్లకు ఐదు నెలల నుంచి కమీషన్ రాకపోవడంతో ఇబ్బంది పడుతున్నామని రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షుడు ఓర్సు వెంకన్న అన్నారు. సోమవారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల ఉపాధ్యక్షులు అబ్బగాని శోభారాణి, గౌరవ అధ్యక్షుడు ఈగల లక్ష్మయ్య, రేషన్ డీలర్లు రేణుక, ఉప్పలమ్మ, శ్రీధర్, వెంకట నరసయ్య, విజయ్ కుమార్, వేణు, యాకయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుంచి పెండింగ్‌లో ఉన్న కమీషన్ విడుదల చేయాలని కోరుతూ మండల డీలర్ల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ లాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కమీషన్‌ను నెలనెలా విడుదల చేయకపోవడంతో డీలర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

విద్యార్థులకు దాతలసాయం అభినందనీయం



విద్యార్థులకు టై, బెల్టులు అందజేస్తున్న ఎంఈఓ

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని మండల విద్యాధికారి రాములు నాయక్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అక్షర ఫౌండేషన్ సూర్యాపేట వారి ఆధ్వర్యంలో బాలాజీ హాస్పిటల్ డాక్టర్ రాజమనోహర్‌రెడ్డి సహకారంతో టై, బెల్ట్‌లు, పౌచ్ కిట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమాజ సేవలో పాలు పంచుకున్నట్లయితే పేదవారికి న్యాయం జరుగుతుందని అన్నారు. విద్యార్థుల చదువుకు ప్రాథమిక పాఠశాలలే పునాదులని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కామనపల్లి విద్యాసాగర్, అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు వ్యాస రాంకుమార్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్లు, డాక్టర్లు గౌతం, స్పందన, ఇరుగు సోమయ్య, యాదగిరి, నాగిరెడ్డి, శ్రీలత, నాగరాజు, రేణుక, జయమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నేడు ఎంపీ, ఎమ్మెల్యే రాక

అర్వపల్లి : అర్వపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్ ప్రారంభానికి ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే సామేల్ మంగళవారం రానున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మోరపాక సత్యం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు హాజరై ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

నూతనకల్ : అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి అన్నారు. సోమవారం పెద్దనెమిలలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పేదవారికి ఇంటిని నిర్మించి ఇవ్వాలనే ఆలోచనతో సీఎం రేవంత్‌రెడ్డి ఇందిరమ్మ పథకం ద్వారా ఇళ్లను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు వెంకన్న, రాంబాబు, సోమిరెడ్డి, మధు, కృష్ణ పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



అర్వపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఎస్‌ఐ సైదులు

అర్వపల్లి : పర్యావరణాన్ని కాపాడటం కోసం మొక్కల సంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్‌ఐ ఈట సైదులు అన్నారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసులతో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి ఒక మొక్కను పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.విజయలక్ష్మి, పీడీ మల్లేష్, హెడ్‌కానిస్టేబుల్ సుధీర్, ఇతర పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.